సాక్షి అనంతపురం

గురువారం । 9 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగం పెరగాలి

- ఎస్పీ పి. జగదీష్



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్, చిత్రంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

అనంతపురం: 'పోక్సో', అత్యాచార కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జ్‌షీట్లు ఏ మాత్రం ఆలస్యం లేకుండా దాఖలు చేసి కోర్టులో విచారణ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. కీలకమైన కేసుల్లో శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు చేపట్టాలన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసులపై అలసత్వం చూపరాదన్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకుని రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పేకాట, మట్కా, కోడిపందేలు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, డీఎస్పీలు వి. శ్రీనివాస రావు, రవిబాబు, ఏ. శ్రీనివాస్, వెంకటేశులు, మహబూబ్ బాషా, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో రాగల నాలుగు రోజులు వర్షం పడే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈ నెల 9న 10 మి.మీ, 10న 14 మి.మీ, 11న 14 మి.మీ, 12న 15 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఉష్ణోగ్రతలు పగలు 34.2 డిగ్రీల నుంచి 34.8 డిగ్రీలు, రాత్రిళ్లు 23 డిగ్రీల నుంచి 23.5 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 68 నుంచి 75, మధ్యాహ్నం 47 నుంచి 70 శాతం మధ్య రికార్డు కావొచ్చన్నారు. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు.

'నారాయణ'లో ఫీ'జులుం'

- ఎస్ఎఫ్ఐ నాయకుల మండిపాటు



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని నారాయణ బాలికల జూనియర్ కళాశాలలో ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. బుధవారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కూడా గడవకుండానే 80 శాతం ఫీజు చెల్లిస్తేనే అనుమతిస్తామంటూ ఆంక్షలు విధిస్తున్నారన్నారు. దాదాపు రూ. 80 వేలకు పైగా చెల్లించాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. ఇంకా ఏడు నెలల గడువు ఉన్నా... ఇప్పుడే అంత ఫీజు చెల్లించాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సబబన్నారు. ఫీజులు కడితేనే రికార్డులు ఇస్తామని, పరీక్ష ఫీజులు కట్టించుకుంటామంటూ మెలిక పెడుతున్నారని వాపోయారు. విద్యార్థులు, తల్లిదండ్రులను మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇంటర్ బోర్డు అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు భీమేష్. నాయకులు సాయికృష్ణ, శేషు, జయ, పరమేష్, శశి, ఓం, షెక్షావలి, అశోక్ పాల్గొన్నారు.

దురాక్రమణలు.. దౌర్జన్యాలు



అనంతపురం నగర పరిధిలో రెచ్చిపోతున్న 'భూ'చోళ్లు

- కూటమి ప్రభుత్వంలో పెరిగిన 'పచ్చ'గద్దల ఆగడాలు
- అమాయకులే లక్ష్యంగా పావులు
- సహకరిస్తున్న కొందరు అధికారులు

అనంతపురంలోని శ్రీ సత్యసాయి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన కనకదుర్గకు స్థానిక శారదానగర్‌లో ఇల్లు ఉంది. ప్రస్తుతం ఇల్లు రూ.1.80 కోట్లకు పైగా విలువ చేస్తుంది. అవివాహితురాలైన కనకదుర్గ గతేడాది నవంబర్‌లో రాజమండ్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. శారదానగర్ ప్రాంతంలోని టీడీపీకి చెందిన భూ బకాసురుడి కన్ను ఆమె ఇంటిపై పడింది. హిందూపురానికి చెందిన బి. శకుంతలకు తన తదనంతరం ఆస్తి చెందేలా కనకదుర్గ వీలునామా రాసినట్లు, ఆ తర్వాత శకుంతల తన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)ని శేఖర్ అనే వ్యక్తికి ఇచ్చినట్లు పత్రాలు సృష్టించాడు. ఇదే క్రమంలో కనకదుర్గ సోదరుడి కుమారుడైన సాయి మనోహర్.. తన అత్త ఇంటిని విక్రయించాలనే ఆలోచనతో వంశవృక్షం కోసం వీఆర్వోను సంప్రదించారు. ఈ విషయాన్ని సదరు వీఆర్వో ద్వారా తెలుసుకున్న 'పచ్చ' నేత... వెంటనే సాయిమనోహర్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని సాయి మనోహర్ ఎదురు తిరగడంతో సెటిల్ చేసుకుందామంటూ బేరసారాలకు దిగాడు.... ఇది చిన్న ఉదాహరణ మాత్రమే..ఇలాంటివి నగరంలో నిత్య కృత్యంగా మారాయి. విలువైన భూములపై కన్నేస్తున్న టీడీపీ నేతలు వాటిని దక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు.

అనంతపురం: కూటమి ప్రభుత్వంలో అనంతపురం నగరంలో కబ్జారాయుళ్లు పెరిగిపోయారు. అధికార దర్పంతో జిల్లా కేంద్రంలో 'పచ్చ' నేతలు కబ్జా కాండ కొనసాగిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరగానే ప్రజాప్రతినిధుల అను'చోరులు' 'భూ'చోళ్ల అవతారమెత్తారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో పూర్తి సమాచారం తీసుకుని అమాయకులను లక్ష్యంగా చేసుకుని బరి తెగిస్తున్నారు. బాధితులు ఇదేమని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగడం, కొట్టడం, కేసులు పెట్టడం చేస్తూ వేధిస్తున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తుండడంతో వీరి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కష్టపడి సంపాదించిన స్థలాలపై గద్దల్లా పడుతుండడంతో బాధితుల ఆవేదన అంతా ఇంతా కాదు.

ప్రజా సంఘాల ముసుగులో..

కొందరు 'భూ'చోళ్లు కొత్త అవతారమెత్తారు. ప్రజా సంఘాల పేరుతో దురాక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల నగరంలో ఇలాంటి ఉదంతాలు కలకలం సృష్టించాయి. తాడిపత్రికి చెందిన చదళ్ల సత్యనారాయణ రెడ్డి లెక్చరర్స్ కాలనీలోని తన 66 సెంట్ల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించగా.. ఇటీవల కొందరు ప్రహరీని ధ్వంసం చేయడమే కాకుండా స్థలంలో గుడిసెలు వేశారు. సత్యనారాయణ రెడ్డిపై బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా.. వారు కేసు నమోదు చేసి శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన గట్టు రామాంజినేయులు, అనంతపురంలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన రామాంజినమ్మ, తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన రాములమ్మను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇటీవల ఇలాంటి మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనంతపురంలోని కమలానగర్‌లో నివసిస్తున్న దంపతులు డాక్టర్ కాటం వీరభద్రయ్య, డాక్టర్ బాలాకుమారిలకు చెందిన 50.67 సెంట్ల స్థలంలోకి కొంత మంది వ్యక్తులు ప్రజా సంఘం పేరుతో అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేశారు. భూమికి సంబంధించి పత్రాలను దంపతులు చూపితే దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు ఆక్రమణకు యత్నించిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి కటకటాల వెనక్కి పంపారు.



పేదలకు ఎర..

భూముల ఆక్రమణలకు పేదవారిని కబ్జారాయుళ్లు ఎరగా వాడుకుంటున్నారు. గుడిసెలు వేసుకుంటే ఎదురులేదంటూ నమ్మబలికి వారితోనూ డబ్బు గుంజుతున్నారు. గుడిసెకు రూ.30 వేల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. కొంత మంది 'తమ్ముళ్లు' ముఠాగా మారి ఇలాంటి వ్యవహారాల్లో ఆరితేరినట్లు తెలుస్తోంది. అయితే, అంతా అయిపోయాక చివరికి పేదలకూ కుచ్చుటోపీ పెడుతుండడం గమనార్హం. చోటా నాయకుల మాటలు నమ్మిన పేదలు డబ్బు పోగొట్టుకోవడమే కాకుండా ఆఖరుకు కేసుల్లో ఇరుక్కొంటున్నారు.

పీడీ యాక్ట్ నమోదుకు వెనుకాడం



భూముల కబ్జాకు పాల్పడితే సహించేది లేదు. ఇటీవలే ఐదు ఘటనలపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కేసులు నమోదు చేసి నిందితులను జైలుకు పంపాం. ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు వెనుకాడం. – పి. జగదీష్, ఎస్పీ

పెండింగ్ పనులు పూర్తి చేయండి

- జేసీ శివ్ నారాయణ్ శర్మ ఆదేశం



సమీక్షిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: మూడో విడత రీ–సర్వే పనులతో పాటు ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించాలని సూచించారు. జేసీ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రజల నుంచి భూ సమస్యలపై అందిన అర్జీల పరిష్కారానికి రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూమి రికార్డుల సవరణ, పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయంలో అధికారులకు రైతులు సహకరించాలన్నారు. రీ–సర్వేలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని చెప్పారు. రైల్వే, జాతీయ రహదారి, సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పూర్తి కావాలన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, నరసాపురం, బెళుగుప్ప, డీ.హీరేహాళ్, ఓబుళాపురం, గుత్తి, బసినేపల్లి, గాంధీనగర్, చట్నేపల్లి, రైల్వే ఆర్ ఓఆర్, తాడిపత్రి, గన్నేవారిపల్లిలో రైల్వే పనులు, గార్లదిన్నె, కనుంపల్లి ఏపీఐఐసీ పనులకు సంబంధించి భూమి సేకరించాలన్నారు. జాతీయ రహదారులు 544డీ, 42, 67లో పెండింగ్ పనులు, నష్ట పరిహారం చెల్లింపు పూర్తవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, భూ విభాగం తహసీల్దారు రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యమేలుతున్న నారా వారి కల్తీ మద్యం

- రైతుల కష్టాలు పట్టని సీఎం చంద్రబాబు..
- మందుబాబులకు మాత్రం కావాల్సిన మద్యం అందిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ మహిళా, యువజన విభాగం నాయకుల ధ్వజం



అనంతపురంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా, యువజన విభాగం నాయకులు

అనంతపురం: నారా వారి కల్తీ మద్యం రాజ్యమేలుతోందని, రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మహిళా, యువజన విభాగం నాయకులు ధ్వజమెత్తారు. యూరియా అందించకుండా రైతులను కష్టపెడుతున్న చంద్రబాబు.. మందుబాబులకు మద్యం మాత్రం ఎక్కడైనా అందిస్తున్నారంటూ మండిపడ్డారు. బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మద్యం బాటిళ్లను కార్యాలయం ఎదుట పగులగొట్టి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏ పల్లెలో చూసినా బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. అధికారుల ప్రోత్సాహంతో మద్యం దుకాణదారులు రెచ్చిపోతున్నారన్నారు. ఎమ్మెల్యేలు సిండికేట్ కింగ్‌లుగా మారిపోయారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులన్నీ అధికార పార్టీ నేతలకు చెందినవేనని గుర్తు చేశారు. కల్తీ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. కల్తీ మద్యం తయారీ గురించి తెలిసినా కట్టడి చేయకుండా సంబంధిత అధికారులు మొద్దునిద్ర పోతున్నారని, వారిని మేల్కొలిపేందుకే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తుండడంతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని వాపోయారు. టీడీపీ నేతల కల్తీ మద్యం కారణంగా పేద, మధ్య తరగతి వర్గాల మహిళల తాళిబొట్లు తెగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చెప్పిన సంపద సృష్టి ఇదేనా అంటూ మండిపడ్డారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టానన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, మహిళా విభాగం జనరల్ సెక్రటరీలు పార్వతి, అంజలి,క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి జానీ, యువజన విభాగం ఉపాధ్యక్షులు వినీత్, ఉదయ్, యువజన విభాగం నగర జనరల్ సెక్రటరీ మసూద్ వలి, నగర కార్యదర్శి మైను, మహిళా నగరాధ్యక్షురాలు చంద్రలేఖ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెగులు.. దిగులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటలను పురుగులు, తెగుళ్లు వ్యాపించి దెబ్బతీస్తున్నాయి. వేరుశనగలో కాండంకుళ్లు తెగులు, తిక్క ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పత్తిలో రసం పీల్చుపురుగు, తెల్లదోమ, గులాబీ రంగు కాయతొలచు పురుగు ఆశించాయి. వరిలో ఆకుముడుత, ఆముదంలో నామాలపురుగు ఆశించి దెబ్బతీస్తున్నాయి. కందిలో మారుకామచ్చ పురుగు, పచ్చపురుగు, పెసర, మినుములో మారు కాగూడు కట్టే పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, మిరపలో తామరపురుగు, పచ్చపురుగు తదితర చీడపీడలు, తెగుళ్లు పంటలను దెబ్బతీస్తుండటంతో పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి. దిగుబడులపై కూడా తీవ్ర ప్రభావం చూపించే పరిస్థితి నెలకొంది.

పదును వర్షమే లేదు..

సరైన వర్షం లేక నెల రోజులవుతోంది. సెప్టెంబర్ 11 నుంచి ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు నెల రోజులు కావొస్తున్నా సరైన పదును వర్షం కురవలేదు. తేలికపాటి మినహా పెద్దగా వర్షాలు పడకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటలు ఎండుముఖం పట్టాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఆకాశం మేఘావృతం కావడం ఇలా మారిన వాతావరణ పరిస్థితుల్లో దాదాపు అన్ని పంటల్లో చీడపీడల వ్యాప్తి పెరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రబీ పంటల సాగుకు ఇబ్బంది

వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న లాంటి వర్షాధార పంటలు తేమ లేక వాడిపోతున్నాయి. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 111.6 మి.మీ కాగా 87 మి.మీ వర్షం కురిసింది. ప్రస్తుత అక్టోబర్‌లో ఇంకా వరుణుడు బోణీ చేయలేదు. అక్టోబర్‌లో 100.9 మి.మీ సాధారణ వర్షపాతంగా గుర్తించినా ప్రస్తుతానికి కేవలం 2.3 మి.మీ నమోదు కావడం గమనార్హం. దీంతో అటు ఖరీఫ్ పంటలతో పాటు ఇటు రబీ పంటల సాగుకు కూడా ఇబ్బందికరంగా మారింది.



కనగానపల్లి మండలం వేపకుంటలో ఎండుముఖం పట్టిన ఆముదం

ఖరీఫ్‌లో దారుణంగా

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 3.43 లక్షల హెక్టార్లకు గానూ 88 శాతంతో 3.01 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేశారు. అత్యధికంగా కంది 1.04 లక్షల హెక్టార్లు, వేరుశనగ 91 వేల హెక్టార్లు, పత్తి 26 వేల హెక్టార్లు, మొక్కజొన్న 29 వేల హెక్టార్లు, ఆముదం 16 వేల హెక్టార్లలో వేశారు. అటు శ్రీ సత్యసాయి జిల్లాలోనూ పరిస్థితి దారుణంగానే ఉంది. ఖరీఫ్‌లో 2.20 లక్షల హెక్టార్లకు గానూ 1.20 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. అందులో 49 వేల హెక్టార్లలో వేరుశనగ, 27 వేల హెక్టార్లలో కంది, మొక్కజొన్న 23 వేల హెక్టార్లు, ఆముదం 5 వేల హెక్టార్లు, పత్తి 4 వేల హెక్టార్లలో సాగు చేశారు.

కరిగిపోయినా.. కళ్లప్పగించి చూస్తూ!

కందుకూరు గిడ్డంగుల్లో అడుగంటిన బియ్యం స్టాక్

- 15 వేల టన్నులకు ఉన్నది 966 టన్నులే
- కనీసం నెల కోటా కూడా నిల్వ చేయని వైనం
- స్టాక్ రాకపోతే లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం కూడా ఉమ్మడి జిల్లాకు సకాలంలో సరఫరా కావడం లేదు. ఇటు సర్కారుకు... అటు అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఏ మాత్రం తేడాలొచ్చినా ప్రజా పంపిణీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. అంతిమంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరో వారం రోజుల్లో ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా కావాల్సి ఉన్న తరుణంలో... అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల్లో బియ్యం నిల్వలు 996 టన్నులు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



కందుకూరు గోదాములో నిల్వ ఉన్న కొద్దిపాటి బియ్యం

ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా

ఉమ్మడి జిల్లాలోని 24 ఎంఎల్ఎస్ పాయింట్లకు కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల నుంచి 19,500 టన్నుల బియ్యం రవాణా అవుతుంది. శ్రీ సత్యసాయి జిల్లాకు నెలసరి 10 వేల టన్నులు, అనంతపురం జిల్లాలోని 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో 6 పాయింట్లకు ఇక్కడి నుంచి 5 వేల టన్నులు, మరో 6 పాయింట్లకు గుంతకల్లులోని గోడౌన్ నుంచి 4,500 టన్నులు రవాణా చేస్తారు.

అడుగంటిన నిల్వలు..

వాస్తవంగా ప్రతి నెలా 15లోపు ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేస్తే అక్కడి నుంచి 30వ తేదీలోపు చౌక దుకాణాలకు చేరవేస్తారు. ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి వచ్చినా ప్రజా పంపిణీ వ్యవస్థకు ఆటంకం రాకూడదనే ఉద్దేశంతో గోదాముల్లో కనీసం ఒక నెలకు సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచుతారు. అయితే ప్రస్తుతం కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల్లో 996 టన్నులు మాత్రమే ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు 15 వేల టన్నుల బియ్యం రవాణా ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టాల్సి ఉన్నా బియ్యం స్టాక్ లేని కారణంగా ప్రారంభం కాలేదు.

వచ్చినా జాప్యం తప్పదు...

బియ్యం స్టాక్ మూడు రోజుల్లో గిడ్డంగులకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, స్టాక్ వచ్చినా సరుకులను సకాలంలో రవాణా చేయడంలో ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు చెబుతున్నట్లు 11వ తేదీకి సరుకు వస్తే 15వ తేదీలోపు ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేయడం అంత సులభం కాదు. అక్కడి నుంచి 30వ తేదీలోపు చౌక దుకాణాలకు చేరవేయడంలోనూ జాప్యం తప్పదు. ఈ సమస్య నుంచి గట్టేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టకపోతే లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ఇబ్బంది లేకుండా చూస్తాం



కొన్ని కారణాల వల్ల బియ్యం స్టాక్ రావడం ఆలస్యమైంది. మూడు రోజుల్లో 9 వేల టన్నుల బియ్యం చేరుతుంది. వచ్చిన వెంటనే ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేయడం ప్రారంభిస్తాం. లబ్ధిదారులకు ఇబ్బంది రాకుండా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

అశ్వవాహనం అధిష్టించి.. అభయమిచ్చి



తాడిపత్రి రూరల్: భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మూలవిరాట్‌కు అర్చకులు మురళిస్వామి అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఆశీనులను గావించారు. అనంతరం స్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను దీవించారు.

నేడు చక్రస్నానం

చింతలవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగియనున్నాయి. చివరి రోజు భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు ముగింపు పలుకుతారు.

క్లుప్తంగా

బస్సు ఢీ - యువకుడికి గాయాలు

• కండక్టర్‌పై స్థానికుల దాడి

గుత్తి రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్రవాహనదారుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... వ్యక్తిగత పనిపై బుధవారం గుత్తికి వచ్చిన మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన యువకుడు రమణయ్య... పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. కొత్తపేట గ్రామం వద్దకు చేరుకోగానే 67వ జాతీయ రహదారిపై తాడిపత్రి నుంచి గుత్తి వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఘటనలో రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతి వేగం, అజాగ్రత్తనే ప్రమాదానికి కారణమంటూ కండక్టర్ మల్లికార్జునపై దాడి చేశారు. గాయపడిన కండక్టర్‌ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రెండేళ్ల జైలు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి ఎం. బొజ్జప్ప తీర్పు చెప్పారు. 'కియా' ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం వీరన్నపల్లికి చెందిన నూతనపాటి నరేష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. 2020 మే 23 తేదీన కారులో కర్ణాటక నుంచి మద్యాన్ని జిల్లాకు తీసుకువస్తూ మార్గమధ్యంలో 'కియా' వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అప్పటి ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో బుధవారం ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పసివాడి ప్రాణం... లెక్కలేని తనం

• శిశువు పరిస్థితి విషమంగా ఉన్నా పట్టించుకోని శిశుగృహ సిబ్బంది
• ప్రాణం కోల్పోయినా పట్టనట్లు వ్యవహరించిన డీఎంసీ కో–ఆర్డినేటర్
• మరుసటి రోజు కూడా శిశుగృహలోకి అడుగుపెట్టని వైనం
• అసలైన బాధ్యులు వీరేనని ఐసీడీఎస్ వర్గాల్లో చర్చ



ఈనెల 4న బీకేఎస్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంసీ కో ఆర్డినేటర్ శ్రీదేవి



అదే సమయంలో శ్మశాన వాటికలో మాస్టర్ నిరూప్ అంత్యక్రియలు జరుగుతున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: పసివాడి ప్రాణమంటే వారికి లెక్కలేని తనం. తమను అడిగే వారు ఎవరు లేరన్న ధీమాతో ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రజానీకం 'ఎంత ఘోరం' అని చర్చించుకుంటున్నా.. వారిలో కనీస పశ్చాత్తాపం కనిపించడం లేదు. పర్యవేక్షణ లోపం కారణంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నాగమణిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి... అసలైన బాధ్యులపై ఎలాంటి చర్యలకూ ఆదేశించకపోవడం ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. శిశువు మృతికి శిశుగృహ మేనేజర్, మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్, మరికొందరి నిర్లక్ష్యం కూడా కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఈ నెల 3న అర్ధరాత్రి శిశుగృహలో ఏం జరిగిందనే అంశంపై ఆరా తీస్తే అత్యంత బాధాకరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

శిశుగృహలో అంతర్గత పోరు

సిబ్బంది మధ్య అంతర్గత పోరు కారణంగా కొంత కాలంగా శిశుగృహ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా చిన్నారుల సంక్షేమాన్ని అక్కడి సిబ్బంది మరుగున పడేశారు. దీంతో ఆరోగ్యంగా ఉన్న చిన్నారులు కాస్త అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇదే చిన్నారి నిరూప్ విషయంలోనూ జరిగింది. ఈ నెల 3న నిరూప్‌కు విరేచనాలయ్యాయి. బాధ్యతగా వైద్య చికిత్సలు అందించాల్సిన శిశుగృహ మేనేజర్ దీప్తి పట్టించుకోకపోవడంతో పాటు అదే రోజు రాత్రి శిశువుకు విధుల్లో ఉన్న ఆయా సక్రమంగా పాలు పట్టకపోవడంతో గుక్క పెట్టి ఏడ్చి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆందోళనకు గురైన ఆయా పరిస్థితిని వివరించడానికి పలుమార్లు ఫోన్ చేసినా మేనేజర్ స్పందించలేదు. దీంతో ఒంటరిగానే శిశువును తీసుకుని సర్వజనాస్పత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది.

మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్‌కు పట్టదా?

మహిళాశిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహ, బాలసదనం, వన్‌స్టాప్ సెంటర్ తదితర విభాగాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తాజాగా మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్‌ను నియమించింది. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) సిఫారసు లేకుండానే తన పలుకుబడిని ఉపయోగించి ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి కో ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. అయితే శిశుగృహలో ఎంతో ఆరోగ్యంగా ఉన్న శిశువు మృతి చెందితే బాధ్యత గల కో ఆర్డినేటర్ శ్రీదేవి ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. 3వ తేదీ రాత్రి శిశువు మృతి చెందిన విషయం తెలిసినా... తనకేమీ పట్టనట్టు శ్రీదేవి ఈ నెల 4న బుక్కరాయసముద్రంలో ప్రభుత్వం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ సేవలో'' పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మరుసటి రోజు తీరికగా శిశుగృహలోకి అడుగుపెట్టారు. శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న శిశువు మరణిస్తే ఏది ప్రాధాన్యతో తెలుసుకోకుండా ప్రచార ఆర్భాటం కోసం ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమంలో పాల్గొనడం అనుమానాలకు తావిస్తోంది. మరుసటి రోజు కలెక్టర్ ఆనంద్ తీవ్రంగా స్పందించి విచారణకు ఆదేశించడంతో తీరిగ్గా అప్పుడు వెళ్లి ఎంతో బాధ్యత ఉన్నట్లుగా నటించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది నవ్వులాట

శిశువు మృతి విషయంలో మిషన్ వాత్సల్య కో ఆర్డినేటర్, శిశుగృహ సిబ్బంది వ్యవహరించిన తీరు ఎంతో బాధాకరమనిపిస్తోంది. త్రీమెన్ కమిటీ విచారణకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించకమునుపు పర్యవేక్షణ బాధ్యతలు తీసుకున్న ఓ అధికారి పత్రికలలో కథనాలను చూసి 'ఇలాంటివి మామూలే... వాళ్లు రాస్తాంటారు.. ఏమైతాది' అని వ్యాఖ్యానించినట్లు ఐసీడీఎస్ వర్గాలు తెలిపాయి. ఏకంగా మహిళాశిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి అప్పటికప్పుడు విజయవాడ నుంచి బయలుదేరి జిల్లాకు చేరుకుని శిశుగృహలో విచారణ చేపడితే ఓ మహిళా ఉద్యోగి నవ్వినట్లు తెలిసింది. ఎందుకు నవ్వుతున్నావని డైరెక్టర్ ప్రశ్నించినట్లు సమాచారం. అంతేకాక మరుసటి రోజు ట్రైనీ కలెక్టర్ సచిన్ రహార్ కూడా శిశుగృహలో విచారణ చేపట్టిన సమయంలో సదరు నవ్విన వ్యక్తి ఎవరని ఆరా తీసినట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే శిశుగృహ సిబ్బంది ఏ స్థాయికి దిగజారారో అర్థం చేసుకోవచ్చు. నిజంగా వారి కుటుంబ సభ్యుల్లోని చిన్నారికి ఈ పరిస్థితి దాపురించి ఉంటే ఇలాగే వ్యవహరించే వారా అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. శిశువు మృతికి అసలు కారకులైన వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే చర్చ సర్వత్రా సాగుతోంది.

తెరపైకి శిశుగృహ మేనేజర్ టెర్మినేట్ ఫైల్

అనంతపురం సెంట్రల్: శిశుగృహలో ఈ నెల 3న రెండు నెలల చిన్నారి నిరూప్ మృతి విషయాన్ని ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టరేట్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించడం... సమాచారం చేరవేయడంలో అలసత్వం కారణంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. నాగమణిపై సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా నిరూప్ మృతికి బాధ్యులైన శిశుగృహ మేనేజర్ దీప్తి విషయంపై ఆరా తీసినట్లు సమాచారం. గతంలో శిశువు దత్తత విషయంగా కెనడాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ మహిళతో డబ్బులు, బంగారు డిమాండ్ చేయడంతో ఆమె కేంద్ర రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భారతదేశ గౌరవాన్ని విదేశీ మహిళ వద్ద దెబ్బతీస్తారా అంటూ కేంద్ర మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో అప్పటి కలెక్టర్ వీరపాండియన్ విచారణ చేపట్టి వాస్తవాలు నిర్ధారించుకున్న అనంతరం దీప్తిని విధుల నుంచి టెర్మినేట్ చేశారు. అయితే తర్వాత సదరు ఫైల్‌లో కీలక సమాచారం మాయం చేసి, తర్వాత కోర్టును ఆశ్రయించి తిరిగి మేనేజర్‌గా వచ్చి చేరినట్లు దీప్తిపై ఆరోపణలున్నాయి. తాజాగా శిశువు మృతికి ఆమె నిర్లక్ష్యం కూడా కారణమని తెలుస్తుండడంతో రాష్ట్ర డైరెక్టరేట్ అధికారులు దీప్తి పనితీరుపై ఆరా తీసినట్లు తెలిసింది. గతంలో టెర్మినేట్ చేసినా కాంట్రాక్టు ఉద్యోగిగా మళ్లీ ఎలా విధుల్లోకి వచ్చారనే అంశంపై లోతుగా ఆరా తీసినట్లు తెలిసింది.

సింగిల్ విండో చైర్మన్‌పై దాడి

యాడికి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని వీఆర్‌ఓల గదిలో యాడికి సింగిల్ విండో ప్రెసిడెంట్ చలమారెడ్డిపై బుధవారం ఓ రైతు దాడికి పాల్పడ్డాడు. మండలంలోని లక్షుంపల్లికి చెందిన రైతులు చెన్నకేశవ, రాజు బంధువులు. గ్రామ సమీపంలో ఉన్న తమ పొలాల విషయంగా ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి. బుధవారం వీఆర్వోల గదిలో ఉన్న చెన్నకేశవను అదే గ్రామానికి చెందిన చలమారెడ్డి చూసి.. భూ వివాదాల్లో వాదనలకు దిగొద్దంటూ హెచ్చరించాడు. అయితే తమ కుటుంబంలోని సమస్యకు ఇద్దరికీ సమ్మతమైన న్యాయ పరిష్కారం చూపాలని చెన్నకేశవ అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆ సమయంలో చెన్నకేశవ అసహనానికి లోనై చలమారెడ్డిపై దాడి చేశాడు. వీఆర్వోలు కల్పించుకోవడంతో చెన్నకేశవ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చలమారెడ్డి ఫిర్యాదు మేరకు చెన్నకేశవను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్



పంచాయతీ కార్యదర్శుల నుంచి ఆప్షన్లు తీసుకుంటున్న డీపీఓ

అనంతపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4కు పదోన్నతి కల్పిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లా పంచాయతీ కార్యాలయంలో బుధవారం చేపట్టి పంచాయతీ కార్యదర్శుల నుంచి ఆప్షన్లను తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 154 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఉండగా, వీరందరికీ గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి సమత, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' మాటలు విని మోసపోయాం

• ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
• అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శివానంద



మాట్లాడుతున్న శివానంద

ఉరవకొండ: ఎన్నికల సమయంలో కూటమి పెద్ద చంద్రబాబు అండ్ కో మాటలు నమ్మి మోసపోయామని అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శివానంద ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వీరశైవ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరశైవ లింగాయత్‌లను శైవక్షేత్రాల్లోని పాలకమండలి కమిటీల్లో అత్యధిక ప్రాధాన్యత కల్పించి పదవులు కేటాయిమస్తామని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు స్పష్టమైన హామీనిచ్చారని గుర్తు చేశారు. రెండు రోజుల క్రితం శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలను ప్రభుత్వం నియమించిందని అయితే వీటిలో వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన ఏ ఒక్కరినీ నియమించకపోవడం బాధాకరమన్నారు. ఇది వీరశైవ లింగాయత్‌లను మోసం చేయడమేనని అన్నారు. అలాగే 2009లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బీసీ–డీ లో లింగాయత్‌లను చేరుస్తూ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఈ ఫైల్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకుండా తొక్కి పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న వీరశైవుల ఆర్థిక, సామాజిక, విద్య పరంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వీరశైవలింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లాలన్నారు.

హెచ్చెల్సీలో కర్ణాటక వాసి మృతదేహం



ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో జమీర్‌వుల్లా షరీఫ్

బొమ్మనహాళ్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక హెచ్చెల్సీలో దూకిన కర్ణాటక వాసి మృతదేహం బుధవారం బొమ్మనహాళ్ మండలంలో బయటపడింది. వివరాలు.. కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన జమీర్‌వుల్లా షరీఫ్ (43) ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ.. మంగళవారం బళ్లారి సమీపంలోని అల్లీపురం వద్దకు చేరుకుని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబసభ్యులకు పంపాడు. అనంతరం హెచ్చెల్సీలో దూకాడు. బుధవారం ఉదయం బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్ సమీపంలోని హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని జమీర్‌వుల్లా షరీఫ్‌గా గుర్తించి సమాచారం ఇవ్వడంతో కర్ణాటక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హొస్పేట్ నుంచి పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై హొస్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మిద్దె పైనుంచి జారి పడి వ్యక్తి మృతి

అనంతపురం: మిద్దెపై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని నీరుగంటివీధికి చెందిన బండి లక్ష్మీనారాయణ (43) బుధవారం ఉదయం తన ఇంటి బాల్కానీ గోడపై కూర్చొని ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితికి చేరుకున్న ఆయనను కుటుంబసభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య అనిత, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మొదలైన పంట కోత ప్రయోగాలు



ఇటుకలపల్లి వద్ద వేరుశనగలో చేపట్టిన పంట కోత ప్రయోగం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు మొదలయ్యాయి. సాగు చేసిన పంటల్లో దిగుబడులు అంచనా వేయడానికి ప్రణాళిక, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు చేపట్టారు. కొన్ని పంటలకు దిగుబడుల ఆధారంగా ఫసల్‌బీమా పరిహారం అందిస్తున్న నేపథ్యంలో ఈ ప్రయోగాలకు ప్రాధాన్యత నెలకొంది. మొత్తంగా 1,122 సీసీఈలు నిర్వహిస్తుండగా ఇందులో గ్రామం యూనిట్‌గా కందికి ఫసల్‌బీమా వర్తింపజేస్తూ అత్యధికంగా 846 ప్రయోగాలు చేపట్టనున్నారు. అలాగే వరిలో 96, జొన్నలో 36, మొక్కజొన్నలో 72, ఆముదంలో 36, ఎండుమిరపలో 36 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ఇవి కాకుండా వాతావరణ బీమా వర్తింపజేసిన వేరుశనగ, పత్తితో పాటు సజ్జ, కొర్ర పంటల్లోనూ కొన్ని ప్రయోగాలు చేపట్టి దిగుబడులను అంచనా వేయనున్నారు. అటు శ్రీసత్యసాయి జిల్లాలోనూ అత్యధికంగా కందిలో 720 పంట కోత ప్రయోగాలు, మొక్కజొన్నలో 84, వరిలో 36, రాగిలో 26, ఆముదంలో 26 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో బుధవారం అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి గ్రామంలో రైతు అంకె బాలపెద్దన్న సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడులు అంచనా వేసేందుకు ప్రయోగం నిర్వహించారు. 5 ఇంటు 5 అడుగుల చుట్టు కొలతల ప్లాట్ నుంచి 2.700 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ వెంకటకుమార్, ఏఈఓ మురళీకృష్ణ తెలిపారు.

జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు



టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం: జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ లీగ్ పోటీల విజేతగా చిత్తూరు జట్టు నిలిచింది. బుధవారం తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగదీష్, జిల్లా అధ్యక్షుడు కె.రవితేజా, కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాంఛూను కలిసిన ఎమ్మెల్యేలు

ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌తో పలువురు ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. మాంఛూ ఫెర్రర్‌ను కలిసిన ఎమ్మెల్యేల్లో జేసీ అస్మిత్‌రెడ్డి, పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఉన్నారు.

పోలీసుల అదుపులో మాంత్రికుడు

పుట్టపర్తి అర్బన్: తమపై, తమ గ్రామస్తులపై చేతబడి చేస్తున్నారంటూ ఓ మాంత్రికుడిని బంధించి పోలీసులకు అప్పగించిన ఘటన కలకలం రేపింది. పుట్టపర్తి మండలం బడేనాయక్ తండాకు చెందిన ఆర్మీ జవాన్ వినోద్‌నాయక్ తెలిపిన మేరకు... జవాన్ కుటుంబం, ఇతరులపై కక్షగట్టిన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ, లక్ష్మీరాం, చంద్రకళ, జయాబాయి.. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన మాంత్రికుడు విరూపాక్షను సంప్రదించి క్షుద్ర పూజలు చేయించారు. బుధవారం జవాన్ కుటుంబసభ్యుల ఫొటోలు, వంశవృక్షం ఉంచి నిమ్మకాయలు మంత్రిస్తూ క్షుద్రపూజలు చేస్తుండగా వినోద్‌నాయక్ గుర్తించి అడ్డుకున్నాడు. అనంతరం మాంత్రికుడిని పోలీసులకు అప్పగించాడు. ఈ విషయంపై ఎస్ఐ లింగన్నను వివరణ కోరగా విరూపాక్షపై గతంలో పలు కేసులు ఉన్నాయని తెలిసిందన్నారు. దీంతో విరూపాక్షతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు.

జ్యోతిష్కుడిపై ఫిర్యాదు

అనంతపురం: నగరంలోని కమలానగర్‌లో జ్యోతిష్య కేంద్రం నిర్వాహకుడు తనను మోసం చేసి రూ.లక్షలు వసూలు చేసుకున్నాడంటూ పోలీసులకు ఓ బాధితురాలు ఫిర్యాదు చేసింది. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించింది. అనంతపురంలో నివాసముంటున్న వివాహిత ఫరీదా భర్త తాగుడుకు బానిసయ్యాడు. వ్యసనాన్ని మానిపించేందుకు ఆమె చేయని ప్రయత్నమంటూ లేదు. ఈ క్రమంలోనే కమలానగర్‌లో ఉన్న చాముండేశ్వరి దేవి జ్యోతిష్యాలయం నిర్వాహకుడు దుర్గాప్రసాద్ శాస్త్రిని సంప్రదించింది. తాగుడు మాన్పిస్తానని, నర దృష్టి లేకుండా చేస్తానని నమ్మబలకడంతో జనవరి నెల నుంచి ఫోన్ పే ద్వారా రూ.1.50 లక్షలు, మరో రూ.2 లక్షలను నగదు రూపంలో మొత్తం రూ.3.50 లక్షలను ఫరీదా చెల్లించింది. అనంతరం ఫరీదా భర్తలో మార్పు రాలేదు కానీ ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. దీంతో డబ్బును వెనక్కు ఇవ్వాలని బాధితురాలు నేరుగా వెళ్లి జ్యోతిష్కుడిని అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న ఆమె బుధవారం వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

వాల్మీకి రథోత్సవంలో రాళ్ల దాడి

శింగనమల: మండలంలోని పెరవలిలో మంగళవారం రాత్రి జరిగిన వాల్మీకి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో టీడీపీ చెందిన నాయకులు యువకులను రెచ్చగొట్టి రాళ్లు రువ్వించారు. సాయంత్రం గ్రామంలో వాల్మీకి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. రాత్రి 9.30 గంటల వరకూ ప్రశాంతంగా జరిగింది. వేడుకగా సాగుతున్న ఈ కార్యక్రమం గిట్టని అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరు యువకులను ఘర్షణకు రెచ్చగొట్టారు. ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశులు గ్రామానికి చేరుకుని ఇరు పార్టీల నాయకులతో చర్చించారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం పోలీసులకు పలువురు వాల్మీకులు ఫిర్యాదు చేశారు.

వెంగన్నపల్లిలో ఉద్రిక్తత

యాడికి: మండలంలోని వెంగన్నపల్లిలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడు రోజుల క్రితం రాత్రి నిద్రిస్తున్న నారాయణస్వామి భార్య లక్ష్మీదేవి పక్కన విశ్వనాథ్ అనే వ్యక్తి పడుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో మేల్కొన్న ఆమె గమనించి గట్టిగా కేకలు వేయడంతో విశ్వనాథ్ అక్కడి నుంచి పారిపోయాడు. ఆ తర్వాత కూడా ఆమె ఎక్కడికెళితే అక్కడకు విశ్వనాథ్ అనుసరించేవాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామ సమీపంలోని కల్లం దొడ్డిలో ఉన్న లక్ష్మీదేవిని చూస్తూ విశ్వనాథ్ సైగలు చేశాడు. దీంతో విషయాన్ని భర్త నారాయణస్వామికి తెలిపి విశ్వనాథ్ ఇంటి వద్దకు చేరుకుని హెచ్చరించి వెళ్లారు. సాయంత్రం 7గంటల సమయంలో విశ్వనాథ్ తనపై దాడి చేశారంటూ తన సోదరులు నరేష్, రంగనాథ్, శ్రీనివాసులు, నాగరాజుకు తెలపడంతో అందరూ కలసి నారాయణస్వామి ఇంటిపై దాడికి తెగబడ్డారు. దీంతో నారాయణస్వామి, లక్ష్మీదేవి, నవీన్‌కు మూగగాయాలయ్యాయి. రంగనాథ్, నరేష్, విశ్వనాథ్‌పై నారాయణస్వామి కొడవలితో దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రికత్త వాతావరణం నెలకొంది.

సీజేఐపై దాడి అమానుషం

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషమని, ఈ దాడి రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై మతోన్మాదుల దాడికి నిరసనగా బుధవారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మానికి అవమానం జరిగిందంటూ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగా చెప్పు విసరడం దేశంలో నెలకొన్న అస్థిరతకు అద్దం పడుతోందని మండిపడ్డారు. మోదీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటికే ధ్వంసం చేస్తూ వస్తున్నారని విమర్శించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నాయకులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామిరెడడి, చంద్రశేఖర్‌రెడ్డి, సావిత్రి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, పరమేష్, ఆర్‌వీనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లతో బెంబేలు



- పేకాట అడ్డాగా కురుగుంట వైఎస్సార్‌కాలనీ
- నిత్యం రూ. 2 లక్షల వరకూ ఆట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో అసాంఘిక కార్యకాలపాలు పెరిగిపోయాయనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. పేకాట, వ్యభిచారం జోరుగా సాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కురుగుంట వైఎస్సార్ కాలనీ ఇటీవల పేకాట అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు ఇందిరమ్మ విగ్రహం సమీపంలోని ఓ ఇంట్లోకి జూదరులు చేరుకుని పేకాట ఆడుతున్నారు. నేర చరిత్ర కల్గి గతంలో ఓ కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చిన వ్యక్తి పేకాట ఆడిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జూదరులకు మందు, స్నాక్స్, సిగరెట్లు అన్నీ నిర్వాహకుడే సమకూర్చుతున్నట్లు తెలుస్తోంది. రోజూ రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఆట సాగుతున్నట్లు సమాచారం. జూదరుల తాకిడి ఎక్కువై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బయటి ప్రాంతాల వారు రాత్రిపూట వస్తుండడంతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోజుల తరబడిగా ఈ వ్యవహారం సాగుతున్నా పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

గుట్టుగా వ్యభిచారం

ఇటీవల అనంతపురం రూరల్ మండలంలో వ్యభిచార కార్యకలాపాలు పెరిగినట్లుతెలుస్తోంది. నగరానికి శివారు ప్రాంతం కావడం... వివిధ ప్రాంతాల నుంచి వలసలు వచ్చిన వారు ఉండడంతో ఇదే అదనుగా కొందరు మహిళలు వ్యభిచార కేంద్రాలను నిర్వహిస్తూ పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు బయటి రాష్ట్రాల నుంచి కూడా యువతులను పిలిపిస్తున్నారు. విటులను నేరుగా ఇళ్లవద్దకే ఆహ్వానిస్తున్నారు. పాపంపేట శివారులోని ఎస్‌బీఐ కాలనీ, ద్వారాకా విల్లాస్ సమీపంలో, అక్కంపల్లి పంచాయతీ ఎన్‌ఆర్ కాలనీలో వ్యభిచార కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిదెబ్బకు సమీప ఇళ్లల్లో ఉండాలంటే కూడా భయపడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఈ తతంగం చాలాకాలం నుంచి జరుగుతున్నా పోలీసులు కనీస చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు.

క్లుప్తంగా

ఆంజనేయులు సేవలు అమూల్యం

- డీఐపీఆర్ఓ కొండయ్య



ఆంజనేయులును సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్: సమాచార శాఖకు ఆంజనేయులు అందించిన సేవలు అమూల్యమని ఐఅండ్‌పీఆర్ డీఐపీఆర్ఓ బాలకొండయ్య కొనియాడారు. సమాచార శాఖ రికార్డు అసిస్టెంట్ ఆంజనేయులు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సమాచార కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆంజనేయులును కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. బాలకొండయ్య మాట్లాడుతూ ఆంజనేయులు అంకితభావంతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఏపీఆర్‌ఓ ఫక్రుద్దీన్, ఎస్ఏ ప్రభావతి, జేఏ చాంద్‌బాషా, సిబ్బంది సుహాసిని, కమల్, ఖాసీం, రాజారావు, తాజుద్దీన్, నజీర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ పంట గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులు సాగు చేసిన వేరుశనగ, ఆముదం పంటలను బుధవారం న్యూఢిల్లీలోని 'అగ్రివాచ్' కంపెనీ నుంచి వచ్చిన మజాహిద్దీన్ బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా పంటల నుంచి ఎంత మేర ఆయిల్ ఉత్పత్తవుతుందో సర్వే నిర్వహించారు. అనంతరం రైతులతో ముఖాముఖి అయ్యారు. పంట ఏ రకం సాగు చేస్తారు... ఎన్ని రోజులకు తొలగిస్తారు... ఎకరాకు ఎంత మేరకు దిగుబడి వస్తుంది.. ఏ మందులు పిచికారీ చేస్తారని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాము, దీపిక, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



భూసార పరీక్షకు మట్టి సేకరించే విధానాన్ని వివరిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: సాయిల్‌హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం రూరల్ కురుగుంట ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల 7,8,9 తరగతుల విద్యార్థినులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. 'ఆత్మ' డైరెక్టర్ పద్మలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూసారం పరీక్షించే విధానం, భూసార పరీక్షల వల్ల కలిగే ఉపయోగాలు,మట్టి నమూనాలు ఎక్కడ తీయాలి, ఎలా తీయాలి, ఏయే పంటలకు ఎంత లోతులో మట్టి తీయాలి అనే అంశాలను వివరించారు. భూసార పరీక్ష కేంద్రం నుంచి హాజరైన వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారి శేఖర్‌రెడ్డి, నివేదిత, కళాశాల ప్రిన్సిపాల్, టీచర్లు, ఏఈఓ భాగ్యలక్ష్మీ, వీహెచ్ఏ లోకేశ్వరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల రిలే దీక్షకు ఏపీఎన్‌జీఓ మద్దతు



ప్రభుత్వ వైద్యులకు సంఘీభావం తెలుపుతున్న ఏపీఎన్‌జీఓ నాయకులు

అనంతపురం మెడికల్: గత కొన్ని రోజులుగా డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో రిలే దీక్షలు చేస్తున్న ఏపీ పీహెచ్‌సీ వైద్యులకు ఏపీఎన్‌జీఓ సంఘం నేతలు బుధవారం సంఘీభావం తెలిపారు. వైద్యుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు అందుబాటులో లేకపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో ఆలోచించి పీహెచ్‌సీ వైద్యులకు న్యాయం చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి చంద్రమోహన్, నగరాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి శ్రీధర్‌బాబు, మహిళా విభాగం చైర్మన్ జమీల బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐద్వా సాంస్కృతికోత్సవం

అనంతపురం కల్చరల్: ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర మహాసభలకు ముందస్తుగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయి. నగరంలోని కృష్ణకళా మందిరం ఇందుకు వేదిక కానుంది. విద్యార్థినులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కళాకారులు నృత్య నాటికలను ప్రదర్శిస్తారు. ఐద్వా రాష్ట్ర నాయకులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

పోరాట పథం..

అవనిలో సగం, ఆకాశంలో సగం అంటూ మహిళలకు మాటల్లో స్థానమిచ్చినా చేతలకొచ్చేసరికి పురుషాధిక్య ప్రపంచం వారి హక్కులను కాలరాస్తూ ఇబ్బందులు పెడుతూనే ఉంది. సమాజంలో మహిళల వెతలను చాటుతూ సమానత్వం కోసం 1936లో కృష్ణా జిల్లా వేదికగా ఆంధ్ర మహిళా సంఘం ఏర్పడింది. నాటి నుంచి మహిళల సమస్యలపై నిత్య పోరాటంతో పాటు చైతన్యం చేస్తూనే ఉంది. 1981లో అఖిల భారత సంఘంలో భాగం కావడంతో తెలుగు గడ్డపై ఉద్భవించిన పోరాట సంస్థ నేడు దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలకు బాసటగా నిలిచింది. మహిళలపై పెరిగిపోతున్న అకృత్యాలతో పాటు అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఐద్వా' 25 ఏళ్ల క్రితం అనంతలోనూ పురుడు పోసుకుంది. తొలి నుంచీ సావిత్రి, డాక్టర్ ప్రగతి, విమలమ్మ, మహిన్‌బీ తదితరులు 'ఐద్వా' పోరాటాలకు బాసటగా నిలిచారు. నేటికీ ముందుండి నడిపిస్తున్నారు. వారి కృషి ఫలితంగానే 'అనంత' వేదికగా తొలిసారి రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. 2012లో కర్నూలులో జరిగిన మహాసభల తర్వాత రాయలసీమలో ప్రథమంగా సాగుతున్న చైతన్య కార్యక్రమాలకు 'అనంత' వేదిక కానుండడం గమనార్హం.



ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) లోగో

రోజుకో అంశం..

జిల్లా కేంద్రంలోని కృష్ణకళా మందిరంలో గురు, శుక్ర, శనివారాల్లో సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. తొలిరోజు ఆహ్వాన గీతంతో నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం, అధికారులు ప్రారంభిస్తారు. శుక్ర, శనివారాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, పాఠశాలలు, డ్యాన్సు అకాడమీల నుంచి కళాకారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి జానపదాలు, కళారూపాలను ప్రదర్శిస్తారు.

> **అండగా నిలవాలి**
>
> మహిళల సమస్యలను ప్రతిబింబిస్తూ సాగే సాంస్కృతిక ఉత్సవాలు, మహాసభలను జయప్రదం చేయడానికి అందరి సహకారం అవసరం. ఆలోచింపజేసే నాటికలను, నాట్యరీతులను తిలకించి కళాకారులను ప్రోత్సహించాలి. మహిళలకు అండగా నిలబడడం ద్వారా సమాజంలో సమానత్వాన్ని కాంక్షించాలి. వేడుకల్లో పాల్గొనడానికి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐద్వా రాష్ట్ర, జాతీయ నాయకులు విచ్చేస్తున్నారు.
>
> - సావిత్రి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు

సజావుగా వాహనాల వేలం

అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వాహనాల బహిరంగ వేలం సజావుగా సాగింది. వేలం ద్వారా కార్యాలయానికి రూ.2.72 లక్షల ఆదాయం సమకూరింది. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో 11 పాత వాహనాలకు వేలం నిర్వహించారు. వేలంలో 45 మంది పాటదారులు ఒక్కొక్కరు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు.11 వాహనాలకు విడివిడిగా వేలం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీటీఓ హుసేన్‌పీరా, ఈఎంవీఐ శ్రీనివాసులు, పరిపాలనాధికారి అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, సిబ్బంది పురుషోత్తం, షఫీ, రామప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్లిష్ట పరిస్థితుల్లోకి దేశం

అనంతపురం టవర్‌క్లాక్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించకుంటే దేశం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లడం తథ్యమని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కటిక జయరామ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సుప్రీంకోర్టు జడ్జిలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

వైఎస్ జగన్‌ను కలసిన లింగాల



అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇటీవల పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ (ఎస్ఈసీ)గా నియమితులైన లింగాల శివశంకర్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లింగాల శివశంకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. లింగాల శివశంకర్ రెడ్డి వెంట పార్టీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి తదితరులున్నారు.

తోపుదుర్తి సోదరులపై నోరు జారితే తోలుతీస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ చిన్న, వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరు: ప్రజా సంక్షేమం కోసం పాటు పడే తోపుదుర్తి సోదరులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇక నుంచి చూస్తు ఊరుకోబోమని, అలాంటి వారి తోలుస్తామని మండలంలోని బి. యాలేరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు హెచ్చరించారు. బుధవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్ నారాయణరెడ్డి(చిన్నా), బండి నాగరాజు విలేకరులతో మాట్లాడారు. తోపుదుర్తి సోదరుల భిక్షతో పదవులు పొంది రాజకీయంగా గుర్తింపు తెచ్చుకున్న బండి పరుశురామ్ అనే వ్యక్తి...నేడు వారిపైనే ఇష్టానుసారం మాట్లాడుతున్నాడన్నారు. గతంలో పరుశురామ్ అనే వ్యక్తి ఇంట్లోని వ్యక్తిని సర్పంచ్ చేసేందుకు అందరూ కష్టపడ్డ విషయం గుర్తించాలన్నారు. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న పరుశురామ్.. తన సొంత అన్న బండి నాగరాజు భూమిని లాక్కునేందుకు ప్రయతించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రైతులకు ఉచిత బోర్లు వేయించారని, ఎంతో మందికి విద్యకు, వైద్యానికి అండగా నిలిచారన్నారు. అలాంటి వ్యక్తులపై బురద చల్లితే సహించేది లేదన్నారు. సమావేశంలో వడ్డే ఈశ్వరయ్య, నరసింహులు, తలారి చంద్ర, సాంబ, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు....అండగా ఉంటాం

- పలువురికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భరోసా

రాప్తాడు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం పలువురిని పరామర్శించారు. అధైర్య పడకండి...అండగా ఉంటామని ఆయా కుటుంబాలకు భరోసా కల్పించారు. రాప్తాడు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు సాకే నాగన్న మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం నాగన్న ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గత నెల 7వ తేదీన రాప్తాడుకు చెందిన తలారి గిరిష్ కుమార్ పండమేరు వంకలోకి ఈతకు వెళ్లి మృతి చెందగా...వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బుక్కచెర్ల గ్రామానికి చెందిన సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు గంగలకుంట మధుసూదన్ రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, రాప్తాడు, రామగిరి మండల కన్వీనర్లు సాకే వెంకటేష్, మీనుగ నాగరాజు, మండల మాజీ కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు సాకే చంద్ర, జయన్న, పూజారి ఓలయ్య తదితరులు ఉన్నారు.



సాకే నాగన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణ దేవతామూర్తులు



కలశాలను తీసుకొస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమం వేదికగా సాగిన ఆధ్యాత్మిక ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. వివిధ పవిత్రనదీ జలాలతో ఇన్ని రోజులుగా పూజలు నిర్వహించిన కలశాలతో మహాశివుడికి, వివిధ దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. భక్తబృందాలు స్వయంగా కలశాలను ఊరేగింపుగా జమ్మిచెట్టు మీదుగా ప్రదక్షిణలతో తీసుకువచ్చి సంప్రోక్షణ చేశారు. చివరిరోజు ఆంజనేయ సమేత నవగ్రహాల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. మహా పూర్ణాహుతి అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, విశ్వనాథ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: ఆరోగ్యకరమైన జీవనానికి పరిశుభ్రత చాలా ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.జ్యోతి తెలిపారు. అనంతపురం రూరల్ –5 సెక్టార్ పరిధిలోని ఎ.నారాయణపురం –2 సచివాలయంలో బుధవారం పోషన్ మహా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూపర్‌వైజర్‌తో పాటు సచివాలయ కార్యదర్శి జయచిత్ర హాజరై మాట్లాడారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. మరుగుదొడ్లు వాడిన తర్వాత, పిల్లల సంరక్షణ తర్వాత చేతులను సబ్బుతో కడగాలన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి.శిరీష, ఏఎన్ఎం నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనంతలక్ష్మి, ముంతాజ్, రామాంజినమ్మ, ఆశావర్కర్ వినీత, గ్రామప్రజలు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో పప్పుశనగ పంపిణీ చేయాలి

అనంతపురం అర్బన్: రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం తప్ప రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్నది శూన్యమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రబీలో విత్తన పప్పుశనగ 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేరులతో వారు మాట్లాడారు. 2024 రబీలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ప్రస్తుత రబీలో పప్పుశనగ 25 శాతం సబ్సిడీతో ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. ప్రస్తుత రబీలో 65,017 హెక్టార్లలో పప్పుశనగ సాగువుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. ప్రస్తుతం బయటి మార్కెట్‌లో పప్పుశనగ క్వింటాలు ధర రూ.5,800 నుంచి రూ.6 వేలు వరకు ఉందన్నారు. అయితే ప్రభుత్వం క్వింటాలు ధర రూ.7,800 నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పడం రైతులకు అన్యాయం చేయడమే అన్నారు. గతంలో 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేశారన్నారు. నష్టాల్లో ఉన్న రైతులు ఈ రబీలో పంట సాగు చేయాలంటే 25 శాతం కాకుండా 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, మధు, వీరుపాక్షి, బీహెచ్‌రాయుడు, రాజారామిరెడ్డి, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

హవ్వ.. ఆస్పత్రుల్లో జీఎస్టీపై అవగాహనా!

- కూటమి సర్కారు వింత నిర్ణయం

అనంతపురం మెడికల్: 'సూపర్ సిక్స్' హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో తాత్సారం చేస్తోంది. ఇదే క్రమంలో జీఎస్టీ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి రోగులను వాడుకోవాలని చూస్తోంది. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలకు అనారోగ్యంతో వచ్చే రోగులకు వైద్యం అందించే విషయాన్ని పక్కన పెట్టి 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' అంటూ చైతన్యం తీసుకురావాలనే కార్యక్రమానికి తెరలేపారు. వాస్తవంగా ప్రభుత్వ ఆస్పత్రులకు జ్వరం, దగ్గు, తదితర సమస్యలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడుతూ వస్తుంటారు. వైద్యం దొరికితే చాలు స్వామి అనుకునే వారికి ఇప్పుడు మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తగ్గించారని చెప్పే కార్యక్రమానికి పీహెచ్‌సీలను వేదిక చేసుకోవడం పెద్ద దుమారం రేపుతోంది. ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లారు. ఇలాంటి సమయంలో అందుబాటులో ఉన్న వైద్యులను వినియోగించుకుని రోగులకు సేవందించేలా చూడాల్సిన ప్రభుత్వం ఏవేవో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంపై ప్రజలు మండిపడుతున్నారు.



వైద్యులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

సెలవులుండవ్..

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి బుధవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీహెచ్‌సీ వైద్యులు, స్టాఫ్‌నర్సులు తదితరులకు క్లాస్ తీసుకున్నారు. సూపర్ జీఎస్టీపై గురువారం ఆస్పత్రులకు వచ్చే రోగులకు వివరించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, తదితరులు ఎటువంటి సెలవులు తీసుకోవద్దని డీఎంహెచ్ఓ అల్టిమేటం జారీ చేశారు. నిర్దేశిత సమయంలో అందుబాటులో ఉండాలని చెప్పారు. వైద్యాధికారులు సమ్మె విరమించే వరకు సెలవులుండవని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతుల్లో అన్యాయం చేస్తే సహించం

అనంతపురం రూరల్: గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతి విషయంలో రాజకీయ సిఫార్సులకు తావు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులున్నారు.


మతోన్మాద న్యాయవాదిని శిక్షించాలి

అనంతపురం అర్బన్: అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అత్యంత హేయమని సీపీఐ నాయకులు అన్నారు. యావత్ జాతి తలదించుకునేలా చేసిన మతోన్మాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో సీజేఐపై కోర్టులోనే న్యాయవాది కిషోర్ దాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సనాతన ధర్మం పేరుతో జరుగుతున్న దాడులపై రాష్ట్రంలో కొత్తగా వచ్చిన సనాతన సేనాని పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా కళ్లు తెరిచి బీజేపీ పాలకవర్గాన్ని ప్రశ్నించాలని హితవు పలికారు. అధికారం కోసం విధానాలను మార్చుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, రామాంజనేయులు, లింగమయ్య, రమణ, అల్లిపీరా, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, పార్వతిప్రసాద్, జయలక్ష్మి, కుళ్లాయిస్వామి, ఎల్లుట్ల నారాయణస్వామి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సింగానహళ్లిలో చోరీ

బొమ్మనహాళ్: సింగానహళ్లిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న వంద్రప్పకు ఆదివారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను బెంగళూరుకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఆయన పెద్దల్లుడు పరమేష్ మాత్రమే ఉన్నాడు. సోమవారం ఉదయం లేచి తన సొంత ఊరు గోవిందవాడకు వెళ్లిపోయాడు. మంగళవారం పరమేష్ తిరిగి ఇంటికి వచ్చినప్పుడు తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం కలిగింది. లోపలికెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చాడు. వెంటనే స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీముల సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. 20 తులాల బంగారం, రూ.20 వేల నగదు చోరీకి గురయ్యిందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హారిక



ఆత్మకూరు: స్థానిక కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హారిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీమారోజ్ తెలిపారు. బుధవారం అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో హారిక సత్తా చాటిందన్నారు. దీంతో నిర్వాహకులు హారికను అండర్–19 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

2.17 లక్షల యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి

కూడేరు: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) వద్ద ఏర్పాటైన ఏపీ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం నాటికి 2.17 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఏపీ జెన్‌కో జేఈ కిరణ్ తెలిపారు. రెండు టర్బైన్లు ఉండగా ప్రస్తుతం ఒక టర్బైన్‌లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఒక టర్బైన్‌లో గంటకు 3 వేల యూనిట్ల చొప్పున రోజుకు 72,500 యూనిట్లు ఉత్పత్తి అవుతోందన్నారు. రెండేళ్ల తర్వాత ఈ నెల 5 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఎక్కువ నీటిని విడుదల చేస్తే రెండో టర్బైన్‌లో కూడా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు.